# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :146 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 13-08-2025 | పేజీలు:4 వెల: 2.00


## పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి

కోరుట్ల, ఆగస్టు 12 : కోరుట్ల పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో 100 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా పలు వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా వార్డుల్లో వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, నివారణ చర్యలపై కాలనీవాసులకు కమిషనర్ అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి నుంచి వచ్చే తడి, పొడి, హానికరమైన చెత్తను వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య వాహన సిబ్బందికి అందించాలని కోరారు.దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని లేనిచో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు పట్టణంలోని గడి గురుజు మార్కెట్ ఏరియా, వివేకానంద నగర్, నంది చౌరస్తా, కొత్త బస్టాండు వద్ద కళాజాత బృందం సభ్యులచే పాటల రూపంలో ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలు, అపరిశుభ్రతతో వచ్చే వ్యాధులు, నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## మంత్రి పదవిపై మరోమారు రాజగోపాల్ కస్సుబుస్సు



నల్గొండ,ఆగస్ట్12: మంత్రి పదవి విషయంలో తనకుకావాలనే అన్యాయం చేయడంపై మరోమారు కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పార్టీనేతల తీరుపై విమర్శలు గుప్పించారు. కేబినెట్‌లో ఇద్దరు అన్నదమ్ములకు పదవులు ఇవ్వడం సాధ్యం కాదని చెబుతున్నవారు, పార్టీలో ఇద్దరు ఉన్నారని ముందు తెలియదా అని కూడా ప్రశ్నించారు. మంత్రి పదవి విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మునుగోడు మండలం ఎలగలగూడెంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్సీ నెలికంటి సత్యంతో కలిసి కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్ గోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తన నియోజకరవ్గం మునుగోడు ప్రజలకు అన్యాయం జరిగితే తనకు అన్యాయం జరిగినట్లేనని రాజ్ గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. తనకు అన్యాయం జరిగితే ఫర్వాలేదు కానీ మునుగోడు ప్రజలకు అన్యాయం చేయొద్దని.. గత ప్రభుత్వానికి చెప్పానని.. ఈ ప్రభుత్వానికి కూడా చెబుతున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ హై కమాండ్ తనకు మంత్రి పదవి ఇస్తానని మాట ఇచ్చింది, మంత్రి పదవి ఇచ్చినప్పుడు ఇవ్వండి కానీ.. అప్పటివరకు మాత్రం మునుగోడు అభివృద్ధికి సహకరించి ఒక్క రూపాయి కూడా ఆపొద్దని కోరారు. తనకు మంత్రి పదవి ఇస్తామన్నమాట ఆలస్య మైందని.. సమీకరణాలు కుదరటం లేదని ఇప్పుడు ఎందుకు అంటున్నారని ప్రశ్నించారు. తనకు మంత్రి పదవి ఇవ్వడం ఎందుకు కుదరటం లేదు.. ఆ సమీకరణలు రాకుండా ఎవరడ్డుకుంటున్నారు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తనను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకునే సమయంలో మంత్రి పదవి ఇస్తాననే తీసుకున్నారని గుర్తుచేశారు. అప్పుడు తాము ఇద్దరం అన్నదమ్ములం కాంగ్రెస్‌లోనే ఉన్నామని తెలియదా అని నిలదీశారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో మంత్రి పదవి ఇస్తానని రెండోసారి హామీ ఇచ్చారని.. అప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీలో తాము ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని గుర్తులేదా అని కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రశ్నించారు.ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య.. ఒడ్డు దాటాక బోడి మల్లయ్య అన్న చందంగా కొంతమంది నేతల పరిస్థితి ఉందని విమర్శించారు. తొమ్మిది మంది ఎమ్మెల్యేలు ఉన్న ఖమ్మం జిల్లాకి ముగ్గురు మంత్రులు ఉన్నారు కదా అని ప్రశ్నించారు. 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్గొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండటం తప్పా అని నిలదీశారు. ఇద్దరం అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమేనని, ఇద్దరం గట్టి వాళ్లమేనని.. ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటని ప్రశ్నల వర్షం కురిపించారు. మంత్రి పదవి ఇవ్వడానికి ఆలస్యమైనా సరే తాను ఓపిక పడుతానని కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రి పదవి ఇస్తామని మాటిచ్చారు.. ఇచ్చినప్పుడు ఇవ్వండి. ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని పార్టీలోకి తీసుకున్నప్పుడు తెలియదా? లోక్‌సభ ఎన్నికల్లో రెండోసారి హామీ ఇచ్చినప్పుడు తెలియదా? అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమే.. ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి? ఆలస్యమైనా సరే ఓపిక పడుతున్నా? అని అన్నారు.

## నిరాధార ఆరోపణలతో ప్రతిష్టకు భంగం



హైదరాబాద్,ఆగస్ట్12: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కల్వకుంట్ల తారక రామారావు మంగళవారం లీగల్ నోటీసులు పంపించారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని, నిరాధారమైనవని, అవి తన ప్రతిష్టను దిగజార్చే ఉద్దేశంతో చేసినవని కేటీఆర్ లీగల్ నోటీసులో పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన బండి సంజయ్ నిర్వహించిన పత్రికా సమావేశంలో చేసిన ఆరోపణలపై కేటీఆర్ ఈ నోటీసులను పంపించారు. బండి సంజయ్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, దురుద్దేశ పూరితమైనవని కేటీఆర్ తరపు న్యాయవాదులు నోటీసులో తెలిపారు. బండి సంజయ్ తన హోదాను దుర్వినియోగం చేస్తూ, ప్రజల్లో తన ప్రతిష్టను దిగజార్చడానికి ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కేవలం రాజకీయంగా వార్తల్లో నిలిచేందుకు అడ్డగోలుగా ప్రాపగండ చేస్తున్న బండి సంజయ్ పదేపదే ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. బండి సంజయ్ ఆరోపణలతో తన ప్రతిష్టకు భంగం కలిగిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు-తో పాటు- ఆ తర్వాత మంత్రిగా తాను అనేక రంగాల్లో అద్భుతమైన సేవలు అందించానని చెప్పుకొచ్చారు. అయితే బండి సంజయ్ పదేపదే చేస్తున్న వ్యాఖ్యలతో తన క్లయింట్ కేటీఆర్ పరువుకి భంగం కలుగుతుందని నోటీసులో న్యాయవాదులు పేర్కొన్నారు. మీడియా సమావేశంలో బండి సంజయ్ చేసిన ఏ వ్యాఖ్యలకు కూడా ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని, ఒక పార్లమెంటు- సభ్యుడుగా, కేంద్ర మంత్రిగా బాధ్యత కలిగిన పదవుల్లో ఉండి మరొక శాసనసభ్యుడుపైన అసత్య పూరిత అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని లీగల్ నోటీ-సులో కేటీ-ఆర్ న్యాయవాదులు ప్రస్తావించారు. బండి సంజయ్ చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారం లేదని, ఇవి కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే చేశారని నోటీ-సులో వెల్లడించారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ కేటీఆర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. కేటీఆర్ అతని కుటుంబ సభ్యులపై భవిష్యత్తులో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయకుండా ఉండాలని నోటీ-సులో కోరారు. నోటీసులు అందిన ఏడు రోజుల్లోగా ఈ డిమాండ్లను పాటించని పక్షంలో, చట్టపరంగా సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆరోపణలతో కలిగిన నష్టానికి బండి సంజయ్ బాధ్యత వహించాల్సి ఉంటుందని నోటీసులో కేటీఆర్ న్యాయవాదులు పేర్కొన్నారు.

## మూగజీవాలైన కుక్కలు పెద్ద సమస్య కాదు..



న్యూఢిల్లీ,ఢిల్లీ వీధుల్లో కుక్కలు కనిపించరాదని సుప్రీంకోర్టు సోమవారం ఢిల్లీ ప్రభుత్వ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. వీధి కుక్కలన్నింటినీ సాధ్యమైనంత త్వరితంగా స్టెరిలైజ్ చేసి షెల్టర్లకు తరలించాలని సుప్రీంకోర్టు ఢిల్లీ-ఎన్‌సీఆర్ అధికారులను ఆదేశించింది. అయితే, దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలపై జంతు ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో సుప్రీం ఆదేశాలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తాజాగా స్పందించారు. మనం రోజు రోజుకూ సైన్స్, మానవత్వం లేని ప్రాచీన యుగంలోకి వెళ్లిపోతున్నట్లు ఉందని వ్యాఖ్యానించారు. 'మూగజీవాలైన కుక్కలు సమాజంలో పెద్ద సమస్య కాదు. వాటిని పూర్తిగా నిర్మూలించడం సరైన చర్య కాదు. ప్రజలకు భద్రత కల్పించాలనుకుంటే వాటికి స్టెరిలైజేషన్, టీకాలు వేయడం వంటి చర్యలు తీసుకోవాలి' అని సూచించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

### వీధి కుక్కలు కనిపించకూడదు

వీధి కుక్కల కాటు వల్ల రేబీస్ వ్యాధి వ్యాప్తి చెందుతోందని, ముఖ్యంగా పిల్లలు దీనికి గురవుతుండడంతో పరిస్థితి చాలా దయనీయంగా ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. వెంటనే వీధి కుక్కల కోసం షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించింది. దాదాపు 5,000 వీధి కుక్కల కోసం 6 నుంచి 8 వారాలలో షెల్టర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. తమ ఆదేశాలకు అవరోధాలు కల్పించడానికి వ్యక్తులు కాని, సంస్థలు కాని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. అవసరమైతే కోర్టు ధిక్కరణ ప్రక్రియ చేపడతామని కూడా ధర్మాసనం హెచ్చరించింది. వీధి కుక్కలను పట్టుకోవడానికి వచ్చే సిబ్బందిని ఎవరైనా అడ్డుకుంటే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపింది.

## బీజేపీలో చేరుతున్నారా? జర జాగ్రత్త ..



హైదరాబాద్,తెలంగాణ బీజేపీ నేతలను లక్ష్యంగా చేసుకొని ఎమ్మెల్యే రాజాసింగ్ మరొక్కసారి సంచలన మీడియా ప్రకటన విడుదల చేశారు. బీజేపీలో చేరేవారు ఒక్కసారి ఆలోచించి పార్టీలో చేరాలంటూ %మీకూ% రాజసింగ్ సూచించారు. ఒకసారి పార్టీలోకి వచ్చాక కార్యకర్తలకు మీరేం పదవులు ఇప్పించుకోలేరు, మీకు టికెట్ గ్యారంటీ కూడా ఉండదంటూ చేరే నేతలకు రాజసింగ్ హెచ్చరిక చేశారు.బీజేపీలో వేరే పార్టీ నుంచి చాలామంది చేరుతారు అంటూ మంచి వార్త నడుస్తున్నది. బీజేపీలో చేరేవారికి స్వాగతం సుస్వాగతం. కానీ, బీజేపీలో చేరే ముందు కొన్ని మాటలు యాది పెట్టుకోండి అలాగే రాసి కూడా పెట్టుకోండి.బీజేపీలో చేరిన తర్వాత, మీరు కోరుకున్నది మీ అసెంబ్లీలో, మీ జిల్లాలో, మీ పార్లమెంటరీ నియోజకవర్గంలో జరగదు అంటూ రాజాసింగ్ కౌంటర్ వేశారు.మీ పైన విశ్వాసం పెట్టుకొని మీ కార్యకర్తలు బీజేపీలో చేరిన తర్వాత మీరు ఆ కార్యకర్తలకు ఏ పదవి కూడా ఇప్పించుకోలేరు. ఎన్నికల ముందు మీకే టికెట్ వస్తది అని గ్యారెంటీ కూడా ఉండదని తేల్చి చెప్పారు. బీజేపీలో ఈ రోజు మీరు చేరుతారు కదా ఫస్ట్ సీట్లో మీరు ఉంటారు కానీ తర్వాత లాస్ట్ సీట్లోఉంటారని ఎద్దేవా చేశారు, బీజేపీలో చేరిన తర్వాత కొన్ని అలవాట్లు మీరు చేసుకోవాలి. కొన్ని బాధలు కూడా భరించే శక్తి కూడా మీలో పెంచుకోవాలని సూచించారు. అసెంబ్లీలో 11 సంవత్సరాలుగా అణచివేతను ఎదుర్కొంటున్నామన్నారు. మా జిల్లాలో వాళ్ల వ్యక్తి మా నియోజకవర్గంలో వాళ్ల వ్యక్తి మా డివిజన్ లో వాళ్ల వ్యక్తి మేము కోరుకున్నా, గోషామహల్ అసెంబ్లీ నుండి మమ్మల్ని మూడుసార్లు ఎమ్మెల్యేగా చేసిన మా కార్యకర్తల కోసం మేము ఏమీ చేయలేకపోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.బీజేపీలో చేరేముందు బీజేపీలో చేరిన తర్వాత ఏమైతదని అని కొంతమందితో మీరు చర్చించి రావాలని రాజాసింగ్ సూచించారు. విజయశాంతి, జితేందర్ రెడ్డి, నాగం జనార్దన్ రెడ్డి ఇట్లాంటి చాలా మంది వేరే పార్టీ నుంచి బీజేపీలో చేరిన తర్వాత ఏమైంది? చేరిన తర్వాత పార్టీ ఇడిసి ఎందుకు వెళ్ళిపోయారు వాళ్ళతోని ఒక్కసారి చర్చ చేసుకోండని నా పర్సనల్ సజెషన్ అంటూ రాజాసింగ్ కోరారు.హిందూత్వానికి, దేశానికి, సమాజానికి చాలా మంచి పనులు చేస్తున్న ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని అన్న రాజాసింగ్ తెలంగాణలో మాత్రం బీజేపీ ని మా అబ్బపార్టీ అనుకునే వాళ్ళ వల్లనే పార్టీ సర్వనాశనం అయితుందని ఆరోపించారు. బీజేపీలో మేము ఏది చెప్తే అదే అయితది మేము ఏది రాస్తే అదే రాజ్యమైతది అనుకునే వ్యక్తుల వల్లనే పార్టీ సర్వనాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు రాజాసింగ్ ఈరోజు కాకపోతే రేపు తెలంగాణలో రాక్షసులు నాశనమవుతారు. కార్యకర్తల ఆశీస్సులతో భారతీయ జనతా పార్టీ తెలంగాణను పాలిస్తుంది.తెలంగాణలో ముఖ్యమంత్రి బీజేపీ నుండి వస్తారని ఎమ్మెల్యే రాజాసింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగింది..



బెంగాల్: ఎన్నికల సంఘంపై విపక్ష పార్టీలు యుద్ధం సాగిస్తున్నాయి. ఇప్పటికే రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగుతున్నాయి. తాజాగా తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ తీవ్ర ఆరోపణలు గుప్పించారు.గత లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. తిరిగి లోక్‌సభ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.బీహార్‌లో 65 లక్షలు ఓట్లు తొలగించారని.. ఇలాంటి పరిస్థితే పశ్చిమ బెంగాల్‌లో చేపడితే లక్ష మందితో ఈసీ ఆఫీస్ ముట్టడిస్తామని వార్నింగ్ ఇచ్చారు. తప్పులతో కూడిన ఓటర్ల జాబితాతో గత ఎన్నిల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షాలు ఇలాగే ఎన్నికయ్యారని తెలిపారు. లోక్‌సభను రద్దు చేసి కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే తాను రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. తృణమూల్‌తో పాటు ప్రతిపక్ష ఎంపీలందరూ అందుకు సిద్ధమేనని చెప్పారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో ఓటర్ జాబితాలు సరిగ్గానే ఉన్నాయని.. బెంగాల్, బిహార్‌లో మాత్రమే తప్పుగా ఉన్నాయని ఈసీ ఎలా చెబుతుందని ప్రశ్నించారు. బీహార్‌లో న్యాయబద్ధంగా ఎన్నికలు జరిగితే బీజేపీ ఓడిపోవడం ఖాయమని తెలిపారు.మా ప్రాధాన్యత బెంగాల్ అని.. మాకు ఎవరు అండగా నిలిచినా.. మేము కూడా వారికి అండగా నిలుస్తామని ప్రకటించారు. అది ఏ రాజకీయ పార్టీ అయినా కావచ్చని చెప్పారు. మా లక్ష్యానికి మద్దతు ఇస్తే మాకు అభ్యంతరం లేదన్నారు. పార్టీలు మా కోసం రెండు అడుగులు వేస్తే.. మేము కూడా వారి కోసం అలాగే చేస్తామన్నారు. మాకు ఎటువంటి అహంకారం లేదని మేము అధికార బీజేపీకి మాత్రమే వ్యతిరేకం అన్నారు. మొదటి నుంచి ఈ విషయాన్ని స్పష్టంగా చెబుతున్నామన్నారు.

## కోడి గుడ్ల కుంభకోణం రూ. 600 కోట్లు...



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అంటేనే కుంభకోణాల పార్టీ, కమీషన్ల పార్టీ అని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన జీవో 17పై ఆయన మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాలు, వివిధ స్కూళ్ల ఫుడ్ కాంట్రాక్టర్లతో కలిసి మీడియాతో మాట్లాడారు.కేసీఆర్ తెలంగాణ తొలి సీఎంగా సంపద పేద వాళ్ళ చేతిలో ఎలా పెట్టాలి అని ఆలోచించే వారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజల కళ్ళు కప్పి కుంభకోణాలకు అందిస్తూ సంపదనంతా ధనవంతుల చేతిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా జీవో 17 తెచ్చి కోడిగుడ్ల కుంభకోణానికి ప్రదర్శించారు. దాదాపు రూ. 600 కోట్ల కుంభకోణం ఇది. 20 వేల మంది చిరు వ్యాపారుల పొట్ట కొట్టేందుకు జీవో 17 తెచ్చారు. గురుకులాలు, కేజీబీవీ, ఇతర స్కూళ్లల్లో ఫుడ్ కాంట్రాక్టర్లను మార్చేందుకు నిబంధనలను సడలిస్తూ జీవో 17 ఇచ్చారు. ఈ జీవో తో 20 వేల మంది వాళ్ళ మీద ఆధారపడే లక్ష మంది రోడ్ల మీద పడతారు. ఫుడ్ కాంట్రాక్టర్లు 50 లక్షల ఈఎండీ కట్టాలట.. పది తరాలు కష్టపడ్డ చిరు వ్యాపారులకు అంత డబ్బు రాదు. మండలం ఒక యూనిట్‌గా ఓకే బడా కాంట్రాక్టర్‌కు కాంట్రాక్టు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోంది. ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లకు కేసీఆర్ హయంలో రాయితీ ఉండేది అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు.మల్లికార్జున్ ఖర్గే ఎక్కడున్నారు, దళిత మంత్రులు ఎక్కడ ఉన్నారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో 25 శాతం దళితులకు కాంట్రాక్టులు ఇస్తామని చెప్పారు. అది అమలు కాకపోగా వాళ్ళ నుంచి ఉన్నవి లాక్కుంటున్నారు. కోడి గుడ్లు అందించడానికి రూ. 3 కోట్ల టర్నోవర్ ఉండాలట. కేసీఆర్ హాయంలో ఈ నిబంధనలు లేవు. జానారెడ్డి బంధువులో రేవంత్ బంధువులో కాంట్రాక్టులు ఇచ్చేందుకు కుట్ర చేస్తున్నారు. టెండర్ అప్లికేషన్‌కు ఐదు వేల నుంచి రూ. 25 వేల వసూల్ చేస్తున్నారు. కోడి గుడ్డు రేటు గతంలో మార్కెట్ రేటు కన్నా 30 పైసలు ఎక్కువ ఉండేది. ఇప్పుడు కోడి గుడ్డు ధర ఏడు రూపాయలుగా నిర్ణయించారు. కాంట్రాక్టర్ల నుంచి బ్యూరోక్రాట్లు, కాంగ్రెస్ నేతలు కమీషన్లు వసూలు చేస్తున్నారు. ఘోరమైన నేరాలు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో జరుగుతున్నాయని ఆర్ఎస్పీ సూచించింది.కేసీఆర్ పది సంవత్సరాల్లో పేద వాళ్ళ గురించి ఆలోచించారు. గురుకులాల్లో రేవంత్ పాలనలో ఇప్పటి వరకు 103 మంది విద్యార్థులు చనిపోయారు. ఈ విద్యార్థుల మరణాల గురించి పట్టించుకునే శ్రద్ధ సీఎం రేవంత్‌కు లేదు. కాంగ్రెస్ నేతలను మరింత ధనవంతులుగా మార్చేందుకు జీవో 17 తెచ్చారు. టెండర్లకు ఈ నెల 14 వరకు గడువు విధించారు. టెండర్ నిబంధనలు ఇంగ్లీష్‌లో రాసి ఆన్‌లైన్‌లో పెట్టారు. చిరు వ్యాపారులకు అవి అర్థం కావు. ఈ జీవో 17ను రద్దు చేయాల్సిందే. జీవో 17 రద్దుకు బీఆర్ఎస్ ఉద్యమిస్తోంది. జీవో 17 రద్దు కోసం కోర్టుకు కూడా వెళతాం. గురుకులాల్లో వ్యవస్థలను ధ్వంసం చేసే కుట్ర జరుగుతోంది. కలెక్టర్లు, అదనపు కలెక్టర్ల కమీషన్ల మా దగ్గర ఆధారాలు ఉన్నాయి. త్వరలోనే సీఎస్‌ను కలిసి మా దగ్గరున్న ఆధారాలు సమర్పిస్తాం అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

## ప్రియాంకాగాంధీ వ్యాఖ్యలపై ఇజ్రాయెల్ కౌంటర్..



న్యూఢిల్లీ,వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ వర్సెస్ ఇజ్రాయెల్‌గా మారింది. ఇజ్రాయెల్‌పై ప్రియాంకాగాంధీ పెట్టిన పోస్ట్ దుమారం రేపుతోంది.గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం సృష్టిస్తోందని.. ఇప్పటికే 60,000 మందికి పైగా చంపారని.. అందులో 18,430 చిన్న పిల్లలు చనిపోవడం దారుణం అన్నారు. ఇప్పుడు వందలాది మంది పిల్లలు సహా లక్షలాది ప్రజలు ఆకలితో మరణించేలా చేయడం ఘోరం అని వ్యాఖ్యానించారు. మౌనం, నిస్సహాయత కారణంగా ఈ నేరాలకు వీలు కల్పించడం కూడా నేరమే అని అన్నారు. పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ ఇంత విధ్వంసం సృష్టిస్తుంటే.. భారత ప్రభుత్వం మౌనంగా ఉండటం సిగ్గుచేటు అని ప్రియాంకాగాంధీ ఆవేదన వ్యక్తం చేశారు.అయితే ప్రియాంక ఆరోపణలను భారతదేశంలోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఖండించారు. "మీ మోసం సిగ్గుచేటు" అని వ్యాఖ్యానించారు. జాతి నిర్మూలన వాదనను ఖండించారు. ఇజ్రాయెల్.. హమాస్ ఉగ్రవాదులను మాత్రమే చంపిందన్నారు. పౌరులను హమాస్ మానవ కవచాలుగా ఉపయోగించుకుని దారుణలకు పాల్పడిందని గుర్తుచేశారు. గాజాలోకి ఇజ్రాయెల్ 2 మిలియన్ టన్నుల ఆహారాన్ని అందించిందని చెప్పారు. కావాలనే హమాస్.. పౌరులను నిర్బంధించి.. ఆకలిని సృష్టిస్తోందని తిప్పికొట్టారు. గత 50 సంవత్సరాల్లో గాజా జనాభా 450 శాతం పెరిగిందని పేర్కొన్నారు. అక్కడ అసలు మారణహోమమే లేదన్నారు.ఇక ఈ ట్వీట్‌కు ముందు ప్రియాంకాగాంధీ మరొక పోస్ట్ చేశారు. గాజాలో ఇటీవల ఇజ్రాయెల్ రాకెట్ దాడిలో ఐదుగురు జర్నలిస్టులు చనిపోయారు.

# ఇసిపై నమ్మకం కల్పించడమే కర్తవ్యం

న్యూఢిల్లీ,ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశంగా భారతదేశం ఖ్యాతిని పొందింది. లక్షలాది మంది స్వేచ్ఛగా, నిష్పాక్షికమైన ఎన్నికల ద్వారా తమ నాయకులను ఎన్నుకునే శక్తివంతమైన ఎన్నికల ప్రక్రియకు చాలా కాలంగా ప్రశంసలు పొందింది. అయితే, ఓటర్ల జాబితాలో అవకతవకలు, జెర్రీ మాండరింగ్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎం) ట్యాంపరింగ్, సామాజిక సంక్షేమ పథకాల దుర్వినియోగం వంటి ఆరోపణలతో ఇటీవల ప్రజాస్వామ్య ఛత్రం సమగ్రతపై నీలినీడలు కమ్మేశాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తిన ఈ వాదనలు, ఎన్నికల మైదానాన్ని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు అధికార బిజెపి క్రమబద్ధమైన పద్ధతిలో చేస్తున్న ప్రయత్నాలను సూచిస్తున్నాయి. ఈ వ్యాసం ఈ ఆరోపణలను లోతుగా చర్చించి, భారత ప్రజాస్వామ్యంపై వాటి ప్రభావం, ఎన్నికల ప్రక్రియలో ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు చేయాల్సిన తక్షణ సంస్కరణలను పరిశీలిస్తుంది.ఈ వివాదానికి కేంద్ర బిందువు. పెద్ద ఎత్తున ఓటర్ల జాబితా తారుమారు జరిగాయనే ఆరోపణలు. 2025 ఆగస్టు 7న రాహుల్ గాంధీ విలేకరుల సమావేశంలో ప్రత్యేక ఆధారాలు సమర్పించారు. బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌పై దృష్టి సారించిన రాహుల్, కాంగ్రెస్ పార్టీ పరిశీలన బృందం లక్షకు పైగా మోసపూరిత ఓటర్ల నమోదును వెలికితీసినట్లు పేర్కొంది. ఈ ఎంట్రీలను ఐదు రకాలుగా వర్గీకరించారు. నకిలీ ఓటర్లు లేదా చెల్లని చిరునామా గల ఓటర్లు, ఒకే అడ్రస్‌లో నమోదు చేసుకున్న బల్క్ ఓటర్లు, గుర్తించలేని ఫోటోలు ఉన్న ఓటర్లు, నకిలీలు, మొదటిసారి ఓటర్లను నమోదు చేసే ఫారం 6 దుర్వినియోగం. పేర్కొన్న ఉదాహరణలు ఆందోళనకరంగానే ఉన్నాయి. గుర్కీరత్ సింగ్ డాంగ్ అనే వ్యక్తి ఒకే చిరునామాలో ఓటరు జాబితాలో నాలుగు సార్లు కన్పించగా, ఆదిత్య శ్రీవాస్తవ అనే వ్యక్తి ముంబై, లక్నో, బెంగళూరులోని రెండు బూత్‌లతో సహా పలు నగరాలలో ఓటు వేసేందుకు నమోదు చేసుకున్నాడు.ఒక సందర్భంలో ఒకే గది ఉన్న ఇంట్లో 80 మంది ఓటర్లు ఉన్నట్లు జాబితాలో పేర్కొన్నారు. ఒక ఓటరు చిరునామా, తండ్రి పేరులో మిస్టర్ డిఫోజ్ గైడ్స్ అనే అర్థరహితమైన పదం చేర్చారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటం 70 ఏళ్ల శకున్ రాణి అనే మహిళ కొత్త ఓటర్‌గా నమోదు చేసుకోవడం, రెండుసార్లు ఓటు వేసే అవకాశం లభించడం. ఈ ఆరోపణలు కర్ణాటకకే పరిమితం కాలేదు. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఆమ్ ఆద్మీపార్టీ(ఆప్), సమాజ్ వాదీ పార్టీ వంటి ప్రతిపక్షాలు ఆరోపణలు చేశాయి. మహారాష్ట్ర, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలో ఇలాంటి ఆందోళనలు తలెత్తాయి. మహారాష్ట్రలో, 2024 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య కేవలం ఐదు నెలల్లోనే 39 లక్షల మంది అదనపు ఓటర్లను ఓటర్ల జాబితాలో చేరారని కాంగ్రెస్ ఆరోపించింది, ఐదేళ్లలో ఇంత పెద్ద ఎత్తున ఓటర్లు నమోదు కాలేదు.పశ్చిమ బెంగాల్‌లో, 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు నకిలీ ఓటర్లను ఎన్నికల జాబితాలో అక్రమంగా చేరుస్తుననారని, ముర్షిదాబాద్ జిల్లాలో 129 మంది ఓటర్లు, ఇతర రాష్ట్రాల ఓటర్లతో నకిలీ ఓటర్ల ఫోటో గుర్తింపు కార్డు నంబర్‌లను పంచుకుంటున్నారని టిఎంసి నాయకురాలు మమతా బెనర్జీ పేర్కొన్నారు. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత భారత ఎన్నికల కమిషన్‌దే. (ఇసిఐ) అయితే ఇసి ఈ ఆరోపణలపై స్పందించకపోవడంతో తీవ్రవిమర్శలు ఎదురయ్యాయి. మహదేవపుర విషయంలో ఇసిఐ ప్రతిస్పందన, ఫాస్ట్ చెక్ చేయబడిన ట్వీట్, ఈ ఆరోపణలను పరిష్కరించడంలో విఫలమైంది. ప్రతిగా చర్య ప్రారంభించడానికి గాంధీ సంతకం చేసిన ప్రమాణ పత్రాన్ని సమర్పించాలని డిమాండ్ చేసింది. ఇసిఐ ప్రతిస్పందన పట్ల విమర్శలు వెల్లువెత్తాయి.ఇది ఎన్నికల కమిషన్ నిష్పాక్షికత, పారదర్శకత పట్ల ప్రశ్నలను లేవనెత్తింది. ఆటోమాటెడ్ విశ్లేషణ ద్వారా లోపాలు గుర్తించడానికి వీలు కల్పించే యంత్రాలతో చదువగలిగే ఓటర్ల జాబితాను అందించేందుకు నిరాకరించడం మరిన్ని అనుమానాలను రేకెత్తించింది. కాంగ్రెస్ మీడియా, ప్రచారవిభాగం చైర్మన్ పవన్ ఖేరా ఇసిఐ పేర్కొన్న నాన్ -మిషన్ రీడబుల్ పేపర్ రోల్స్‌ను ఏడు అడుగుల కాగితంగా అభివర్ణించారు. దాని పరిశీలన దాదాపు అసాధ్యం, కేవలం ఒక నియోజకవర్గం డేటా విశ్లేషణకే నెలలు పడుతుంది. ఓటర్ల జాబితా తారుమారుకి తోడు, గెర్రీమాండరింగ్ ఆరోపణలు ఆందోళనను పెంచాయి. ఒక పార్టీకి అనుకూలంగా నియోజకవర్గ హద్దులను తారుమారు చేసే పద్ధతి గెర్రీమాండరింగ్. ఎన్నికల్లో ప్రయోజనాలను పొందేందుకు అధికార బిజెపి ఈ సాధనాన్ని ఉపయోగిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి.బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఓటర్ల జాబితా అలాంటి అవకతవకలకు తోడ్పడే సాధనంగా గుర్తించారు. తమకు అనుకూలమైన ఫలితాలు రాబట్టేందుకు నియోజకవర్గాల రూపురేఖలు మార్చేందుకు బిజెపి వ్యూహాత్మకంగా కొత్త ఓటర్లను చేర్చడమో, తొలగించడమో చేస్తుందని ప్రతిపక్షనాయకులు ఆరోపిస్తున్నారు. ఉదాహరణకు, పశ్చిమబెంగాల్‌లోని బంగ్లాదేశ్ హిందూ శరణార్థులను, భాషా మైనారిటీల పేర్లను తొలగించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని టిఎంసి పార్టీ ఆరోపిస్తోంది. గెర్రీమాండరింగ్ పార్టీలు పోటీపడే ఎన్నికల్లో ప్రభావం చూపుతుంది. అక్కడ ఓటర్ల జనాభాలో చిన్నమార్పు ఫలితాలను నిర్ణయించే అవకాశం ఉంటుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి 33 వేల కన్నా తక్కువ ఓట్ల తేడాతో 25 సీట్లు గెలుచుకుందని రాహుల్ హైలైట్ చేశారు. తక్కువ సంఖ్యలో నియోజకవర్గాలను తారు మారు చేయడం ద్వారా పార్లమెంటులో మెజారిటీ పొందవచ్చునని సూచించారు. డీలిమిషన్ ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం, ఈ సమస్య పరిష్కారానికి ఇసిఐ విముఖత చూస్తే, అధికార పార్టీ ఎన్నికల సరిహద్దులు తనకు అనుకూలంగా మార్చి, పాలనా



ప్రక్రియపై తన ప్రభావం చూపుతోందనే ఆరోపణలు వస్తున్నాయి.భారత ఎన్నికలలో ఇవిఎం ట్యాంపరింగ్ ఆరోపణలు ఎంతో కాలంగా వివాదాస్పదంగా మారాయి. ఈ మధ్య ఓటర్ల జాబితా తారుమారు కీలక అంశం అయింది. కాంగ్రెస్‌కు చెందిన ప్రవీణ్ చక్రవర్తి వంటి ప్రతిపక్ష నాయకులు ఇవిఎంల ట్యాంపరింగ్‌కు ఓటర్ల జాబితాలకు మధ్య తేడా గుర్తించారు. ఇవిఎంల ట్యాంపరింగ్‌కు కచ్చితమైన ఆధారాలు లేవు. జాబితా మోసంపై బలమైన ఆధారాలు కన్పిస్తాయి. 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇవిఎంల గురించి ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అక్కడ మహాయతి కూటమి విజయం ప్రతిపక్షాలు, కార్యకర్తల్లో సందేహాలు రేపింది. సాయంత్రం 5.-30 గంటల నుంచి అకస్మాత్‌గా పెరిగిన ఓటర్లు, ఓటింగ్ డేటాలో తేడాలపై నివేదికలు ఆందోళనను పెంచాయి. పోలింగ్ స్టేషన్లలో సిసిటివి ఫుటేజీని 45 రోజుల తర్వాత తొలగించాలన్న ఇసిఐ నిర్ణయం అక్రమాలకు సంబంధించిన ఆధారాలు నాశనం చేసే యత్నంగా విమర్శలపాలైంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఈ వాదనలను ఖండించారు.ఇవిఎంలు ఫుల్ ప్రూఫ్ అన్నారు. పోలింగ్ ఏజెంట్లకు ఇచ్చిన ఫామ్ 17సి లోని నిబంధనలవల్ల ఓటర్ల ఓటింగ్‌లో తారుమారు అసాధ్యం అన్నారు. ఇసిఐ తిరస్కార ధోరణి, ధిక్కార స్వరం ప్రజల అనుమానాలను తీర్చలేకపోయింది. ఓట్ల లెక్కింపులో పారదర్శకతను నిర్ధారించే వివి పాట్‌లను విస్తృతంగా ఉపయోగించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ఎన్నికల కమిషన్ పట్టించుకోకపోవడం ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని క్షీణింపజేస్తోంది. ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను దుర్వినియోగం చేస్తున్నాదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యక్ష నగదు బదిలీ, సబ్సిడీతో ఆహారం, ఇళ్ల నిర్మాణ పథకాలు, బిజెపి విస్తృత సంక్షేమ కార్యక్రమాలను ఓటర్లను, ముఖ్యంగా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలను ఆకట్టుకునే సాధనాలుగా విమర్శకులు చూస్తున్నారు.ఈ పథకాలు పేదల స్థితిగతులను మెరుగుపరచేందుకే అని చెబుతున్నా ప్రతిపక్షపార్టీలు మాత్రం వ్యూహాత్మకంగా ఎన్నికలే లక్ష్యంగా సరైన సమయంలో ప్రవేశపెడుతున్నారని వాదిస్తున్నాయి. ఎన్నికల ప్రకటనకు కొత్త పథకాల ప్రకటన కేవలం ఓటు కొనుగోలు వ్యూహంగా రుజువవుతున్నాయి. ఓటర్ల జాబితా తారుమారు, జెర్రీ మాండరింగ్, ఇవిఎం ఆందోళనలు, సంక్షేమ పథకాల దుర్వినియోగాల ప్రభావం భారత ప్రజాస్వామ్య ప్రక్రియ చట్టబద్ధతకు తీవ్ర ముప్పును కలిగిస్తున్నాయి. రాజ్యాంగం ఆర్టికల్ 326లో పొందుపరచిన సార్వత్రిక వయోజన ఓటుహక్కు సూత్రం నుంచి ఎన్నికల చట్టబద్ధత రూపుదిద్దుకుంది. ఓటర్ల జాబితాలో మోసపూరిత ఎంట్రీలతో కలుషితమైనప్పుడు నియోజకవర్గాల మార్పులు ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రభుత్వ వనరులు ఉపయోగించినప్పుడు ఒకవ్యక్తి, ఒక ఓటు అనే ప్రాథమిక ఆలోచన బలహీనమవుతుంది. రాహుల్ గాంధీ హెచ్చరించినట్లు రిఫరీ తటస్థంగా లేకపోతే క్రీడ లేదు. ఎన్నికల కమిషన్ నిష్పాక్షికంగా లేకపోతే ప్రజాస్వామ్యం లేదు.ఈ సమస్యలను నేరుగా పరిష్కరించడానికి ఇసిఐ విముఖత చూపడం, ప్రజల అపనమ్మకాన్నిమరింత పెంచింది. ఆరోపిస్తున్నవారిని ప్రమాణ పత్రాలను ఇవ్వాలనడం, లాంఛనాలపై కమిషన్ పట్టుదల, మిషిన్ -రీడబుల్ ఓటర్ల జాబితాలు, సిసిటివి వీడియో రికార్డింగ్‌లపై 45 రోజుల గడువు విధించడం, పారదర్శక చర్యలను నిరాకరించడం ఎన్నికల వ్యవస్థ పక్షపాత ధోరణితో ఉందన్న ఆరోపణలకు దారితీసింది. బిజెపి ఈ ఆరోపణలను ఓటమి పాలైన ప్రతిపక్షం నిరాశ నిస్పృహలతో చేసే విమర్శలుగా కొట్టివేస్తే, రవిశంకర్ ప్రసాద్, దేవేంద్ర ఫడ్నవీస్ వంటి వారు ప్రజల తీర్పును కాంగ్రెస్ అవమానిస్తోందని ఆరోపించారు. అయినా బహుళ ప్రతిపక్ష పార్టీలు, పౌరసమాజం, స్వతంత్ర దర్యాప్తు సంస్థలనుంచి ఆందోళనలు పెరుగుతూనే ఉన్నాయి. భారతదేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు తక్షణ సంస్కరణలు అవసరం.మొదట ఇసిఐ యంత్రాలతో చదువగలిగే ఓటర్ల జాబితాలను విడుదల చేయాలి. స్వతంత్ర పరిశీలనకు సిసిటివి ఫుటేజీలను భద్రపరచడం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వడం, ఓటర్ల నమ్మకాన్ని పెంచేందుకు ట్యాంపర్ ప్రూఫ్ రికార్డులను అందించడం. రెండవది. తటస్థ ఏజెన్సీల ద్వారా ఓటర్ల జాబితా థర్డ్ పార్టీ ఆడిట్‌లో లోపాలు గుర్తించి సరిదిద్దడం. మూడవది 1951 నాటి ప్రజాప్రాతినిధ్యం చట్టానికి చట్టపరమైన సంస్కరణలు. ఎన్నికల మోసానికి కఠిన శిక్షలు విధించాలి. చివరిగా టిఎంసి, సమాజ్ వాది పార్టీ వంటివి సూచించిన ప్రజా అవగాహన ప్రచారాలు చేపట్టడం. ఇసిఐ రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా ఎదగాలి. నిష్పాక్షికతకు నిదర్శనంగా నిలవాలి, పౌరులు, జర్నలిస్టులు, పౌరసమాజం ఈ వాదనల పరిశోధనలో పాల్గొంటున్నందువల్ల ఎన్నికల సమగ్రత కోసం పోరాటం ప్రజల ఉద్యమంగా మారుతోంది. ఎన్నికల కమిషన్ నిర్వహించే ఎన్నికలు ప్రజల సంకల్పానికి నిజమైన ప్రతిబింబంగా ఉండేలా చూసుకోవాలి. అందుకు భారతదేశం వేగంగా చర్యలు తీసుకోవాలి.

# లోక్‌సభలో నాలుగు కీలక బిల్లులకు ఆమోదం

న్యూఢిల్లీ,విపక్షాల నుంచి సర్‌పై నిరసనలు గందరగోళం నడుమనే లోక్‌సభలో సోమవారం మొత్తం నాలుగు కీలకమైన బిల్లులు ఆమోదం పొందాయి. రెండు ఆదాయపు పన్ను పన్నుల వసూళ్లకు సంబంధించినవి, మరో రెండు క్రీడావిధానాల సంస్కరణల పరిధిలోకి వచ్చేవి. పన్నుల విధింపు సంబంధిత ఇన్‌కం టాక్స్ (నెంబరు 2) ,పన్నుల విధింపునకు సంబంధించిన టాక్సేషన్ లాస్ (సవరణ) బిల్లు ఇప్పుడు సభామోదం దక్కించుకున్నాయి. సోమవారం ఉదయం సభ ఆరంభం కాగానే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రెండు బిల్లులను సభలో ప్రవేశపెట్టారు. దేశంలో అమలులో ఉన్న ఆదాయపు పన్ను బిల్లు 1961 నాటి ఆదాయ పన్ను చట్టం నిబంధనలకు అనుగుణంగా ఉంది. ఈ చట్టాన్ని సవరించి , సరైన విధంగా పటిష్టం చేసేందుకు ఈ నూతన ఆదాయపు పన్ను బిల్లు తీసుకువచ్చారు.ఈ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందితే పాత చట్టం స్థానంలో కొత్త చట్టం అమలులోకి వస్తుంది. ఆదాయపు పన్ను చట్టం అంశాలను పరిశీలించేందుకు బిజెపి సీనియర్ ఎంపి బైజ్యానాథ్ పాండా సారథ్యంలో ఏర్పాటు- అయిన సెలెక్ట్ కమిటీ- సిఫార్సులను ఈ బిల్లులో పొందుపర్చారు. ఇక పన్నుల విధింపు సంబంధిత బిల్లు పన్నుల వ్యవస్థీకృత పద్ధతులలో మార్పునకు ఉద్దేశించింది. ఈ క్రమంలో ఈ ఏడాది తీసుకువచ్చిన ఫైనాన్స్ యాక్ట్‌ను కూడా సవరించడం జరుగుతుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 13వ తేదీన లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఐటి బిల్లు 2025లో పలు మార్పులు చేర్పులను సెలెక్ట్ కమిటీ- సిఫార్సు చేసింది. ఇవి కూడా ఇప్పటి తాజా బిల్లులో చేరాయి. బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సర్‌పై ప్రతిపక్షాలు సభలో తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తం చేయడంతో సభా కార్యక్రమాల దశలో గందరగోళం ఏర్పడిన దశలోనే ఈ రెండు బిల్లులు ఆమోదం పొందినట్లు- సభాధ్యక్ష స్థానం నుంచి ప్రకటన వెలువడింది. ప్రతిపక్షాల ప్రాతినిధ్యం అంతకు ముందటి చర్చ ప్రక్రియ లేకుండానే ఈ బిల్లు ఆమోదం పొందింది.క్రీడా విధానానికి సంబంధించిన అత్యంత కీలకమైన నేషనల్ స్పోర్ట్ గవర్నెస్ బిల్లును , నేషనల్ యాంటీ- డోపింగ్ సవరణ బిల్లును సోమవారం లోక్‌సభ ఆమోదించింది. సర్‌పై ప్రతిపక్షాల తీవ్ర నిరసనల నడుమనే ఈ బిల్లులు సభా సమ్మతి దక్కించుకుంది. స్వాతంత్ర్యం÷-ర వచ్చిన తరువాత దేశంలో క్రీడా విధాన సంస్కరణల దిశలో తీసుకువచ్చిన బిల్లు ఇదే అని క్రీడల మంత్రి మనుసుఖ్ మాండవీయ తెలిపారు. క్రీడా రంగంలో ఏకైక సంస్కరణల అడుగు అని స్పందించారు. ఈ రెండు క్రీడా బిల్లులతో జవాబుదారి , సరైన న్యాయం, సుపరిపాలనకు వీలేర్పడుతుంది. క్రీడా సమాఖ్యలు సముచితంగా వ్యవహరించేందుకు వీలేర్పడుతుందని మంత్రి తెలిపారు. బిల్లులు సభలో ప్రవేశపెట్టిన సమయంలో సభలో ప్రతిపక్ష నాయకులు ఎవరూ లేరు. దేశ క్రీడా యవనికలో గణనీయ పరిణామానికి దారితీసే ఈ బిల్లుల దశలో ప్రతిపక్షాలు సభలో లేకపోవడం దురదృష్టకరం అని మంత్రి వ్యాఖ్యానించారు.

## జలకళ సంతరించుకున్న ప్రాజెక్టులు

హైదరాబాద్,ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణా పరీవాహక ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు క్రమంగా వరద నీరు పెరుగుతోంది. శ్రీశైలం ఇన్‌ఫ్లో 1,99,714 క్యూసెక్కులు కాగా.. జెట్ ఎ+ఇ-లో 1,00,800 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 35 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ఎడమగట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 30,485 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 881.20 అడుగుల నీటిమట్టం ఉంది. పూర్తి నీటినిల్వ సామర్థ్యం 215.80 టీ-ఎంసీలకు గాను.. ప్రస్తుతం 194.30 టీఎంసీల నీరు ఉంది. మరోవైపు నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండను తలపిస్తోంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు వరద ప్రభావం పెరిగింది. దీంతో 8 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 64,465 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు 65,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. 1,10,483 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి, ప్రస్తుత నీటి మట్టాలు 590 అడుగులుగా ఉన్నాయి. సాగర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం అంతే స్థాయిలో నీరు నిల్వ ఉంది. తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జలాశయాలకు భారీగా వరద నీరు చేరుకుంది. వరద చేరుకోవడంతో పలు ప్రాజెక్టుల గేట్లు- తెరిచారు. నాగార్జునసాగర్, హిమాయత్ సాగర్, శ్రీరాంసాగర్, మూసీ ప్రాజెక్టు, జూరాల ప్రాజెక్టు, తుంగభద్ర డ్యామ్, శ్రీశైలం జలాశయాల్లో భారీగా వరద ప్రవహిస్తోంది. ఈ జలాశయాల దగ్గర ప్రస్తుత నీటి పరిస్థితి ఇలా ఉంది. హిమాయత్ సాగర్‌కు వరద నీరు మళ్లీ పెరిగింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు హిమాయత్ సాగర్‌కు ఇన్‌ఫ్లో పెరిగింది. వరద నీరు పెరగడంతో రెండో గేట్‌ను మూడు ఫీట్ల మేర ఎత్తారు. ఇప్పటి వరకు ఒక్క గేటు- మాత్రమే అధికారులు తెరిచి నీటిని విడుదల చేశారు. హుస్సేన్ సాగర్ డేంజర్ బెల్స్ మోగిస్తుండటంతో ప్రమాదకరస్థాయిలో హుస్సేన్ సాగర్‌కు భారీగా వరద నీరు చేరుకుంది. హుస్సేన్ సాగర్ నీటి మట్టం ఫుల్ ట్యాంక్ లెవెల్ దాటింది. ఎగువ ప్రాంతాల నుంచి హుస్సేన్ సాగర్‌కు వరద పోటెత్తుతోంది. బంజారాహిల్స్, బుల్కాపూర్, పికెట్, కూకట్‌పల్లి నాలాల నుంచి హుస్సేన్ సాగర్‌లోకి వరద వస్తోంది. తూముల ద్వారా హుస్సేన్ సాగర్ నుంచి నీటిని అధికారులు మూసీలోకి వదులుతున్నారు. దీంతో మూసీ పరివాహక ప్రాంత ప్రజలను జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తం చేశారు. తిరిగి క్ష సర్వీస్ రోడ్డును అధికారులు మూసివేశారు. వరద ప్రవాహంతో రాజేంద్రనగర్, హిమాయత్ సాగర్ వైపు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మూసీ పరీవాహక ప్రాంతవాసులను అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

### వాతావరణ శాఖ హెచ్చరికలు

అమరావతి,వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో... సోమవారం ఉదయం జిల్లాల కలెక్టర్లు, విపత్తు నిర్వహణశాఖ అధికారులతో హోం మంత్రి అనిత సమావేశం నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కువగా నష్టం జరగనున్న ప్రాంతాలను ముందే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రమాదకర హాట్‌స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు- చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. తాజా పరిస్థితులపై తనకు ఎప్పటికప్పుడు నివేదించాలని అధికారులను మంత్రి అనిత కోరారు. అన్ని ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కువగా నష్టం జరగనున్న ప్రాంతాలను ముందే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

## సన్నిహితుడి ఘాటు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మీద అనూహ్యంగా ఒక కీలక నాయకుడు విమర్శలు చేశారు. సాధారణంగా ఆయన విమర్శలకు కడు దూరంగా ఉంటారు. ఆయన లో ప్రొఫైల్ మెయింటెయిన్ చేస్తారు. పైగా ఆయన కాంగ్రెస్ రాజకీయాల్లోనే పుట్టి పెరిగి ఎదిగిన వారు. ఏకంగా ఉమ్మడి ఏపీకి మూడేళ్ల పాటు సీఎం గా పనిచేసిన వారు చివరి సీఎం గా రికార్డులకు ఎక్కిన వారు. ఆయనే నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి. ఆయన రాహుల్ గాంధీ మీద ఆయన తెలివి మీద తాజాగా సెటైర్లు వేశారు. అవి సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

రాహుల్ ఆలోచించు అంటూ :

రాహుల్ గాంధీని ఆలోచించు అంటూ మాజీ సహచరుడిగా కిరణ్ కుమార్ రెడ్డి సలహా ఇచ్చారు. మీరు మీ పక్కన ఉన్న వారు తెలివిగా వ్యవహరించండి అని గట్టిగానే అంటించారు. మీ తెలివి మీద కూడా సందేహాలు వస్తున్నాయని అన్నారు. అసలు మీ తెలివి ఏమైందో అని డౌట్ వ్యక్తం చేశారు. బీజేపీ ఈసీతో కలసి రిగ్గింగ్ చేసి మూడోసారి వరసగా కేంద్రంలో అధికారంలోకి వచ్చింది అంటూ రాహుల్ గాంధీ తాజాగా చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అదే సమయంలో ఎన్నికల సంఘం పని తీరు మీద సందేహాలు వ్యక్తం అయ్యేలా చేస్తున్నాయి అని అంటున్నారు. దాంతో బీజేపీలో ఉన్న కిరణ్ ఇపుడు రంగంలోకి దిగారు.

ఆనాడు గెలిచింది కదా :

కేంద్రంలో యూపీఏ అధికారంలో ఉన్నపుడే 2014 ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 282 సీట్లను గెలుచుకుని అప్పటికి మూడున్నర దశాబ్దాలుగా కేంద్రంలో ఏ పార్టీకి సొంతంగా మెజారిటీ రాని స్థితిని బ్రేక్ చేసింది కదా అని గుర్తు చేశారు. ఇక 2019లో అంతకంటే ఎక్కువగా 303 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది కదా అని ఆయన చెప్పారు. ఇక 2024లో కనుక ఈసీతో రిగ్గింగ్ అని రాహుల్ గాంధీ అన్నదే నిజం అనుకుంటే ఏకంగా 400 సీట్లు రావాలి కదా అని ప్రశ్నించారు. బీజేపీ మ్యాజిక్ ఫిగర్ కి కూడా దూరంగా 240 దగ్గర ఎందుకు ఆగిపోతుంది అని ప్రశ్నించారు.

నాకే అర్థం కాదు మరి :

తాను కాంగ్రెస్ పార్టీలో దశాబ్దాలుగా పనిచేశాను అని కిరణ్ చెబుతూ తనకే రాహుల్ గాంధీ తీరు మాటలు ఎపుడూ అర్థం కావని అన్నారు. మహారాష్ట్రలో అయిదు నెలల ముందు ఎంపీ సీట్లు ఎక్కువగా వచ్చాయని అదే అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్లు పోయాయని అదెలా సాధ్యమని రాహుల్ గాంధీ అంటున్నారని కిరణ్ కుమార్ రెడ్డి చెప్పుకొస్తూ ప్రజల విలక్షణ తీర్పునకు అది నిదర్శనమని అన్నారు. 2009లో ఉమ్మడి ఏపీలో ఒకేసారి అసెంబ్లీకీ పార్లమెంట్ కి ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ కి అసెంబ్లీలో 156 సీట్లు మాత్రమే వచ్చాయని అదే ఎంపీ సీట్లు చూస్తే 33 దాకా వచ్చాయని అదే ఒకే రోజు ఒకేసారి ఎన్నికలు జరిగితే అసెంబ్లీ సీట్లలో మెజారిటీలు తగ్గాయని అదే ఎంపీ సీట్లలో పెరిగాయని దీనికి ఏమంటారు అని నల్లారి వారు లాజిక్ తో కూడిన ప్రశ్నను రాహుల్ కి సంధించారు. ప్రజలు చాలా తెలివైన వారు ఎపుడూ అని గుర్తు పెట్టుకోవాలని అన్నారు. ముందు రాహుల్ గాంధీ తనకు తెలివి ఉంటే ఉపయోగించాలని లేకపోతే సలహాలు ఇచ్చేవారికి తెలివైన వారు ఉంటే పెట్టుకోవాలని ఈ మాజీ సీఎం సూచన చేశారు. మొత్తానికి రాహుల్ గాంధీకి మాజీ కాంగ్రెస్ నేత నుంచే ఈ తరహా సెటైర్లు పడటం విశేషం. ఏది ఏమైనా కమలానికి ఈ కష్టకాలంలో కిరణ్ కుమార్ రెడ్డి వైపు నుంచి గట్టిగా వచ్చిన సమర్థింపు మాత్రం పెద్ద ఎత్తున ఊరటగా ఉంది అదే సమయంలో మాజీ

## బ్యాంకుల పరిధిలోనే మినిమమ్ బ్యాలెన్స్ వ్యవహారం

గాంధీనగర్, బ్యాంకులో ఖాతాదారుల అకౌంట్స్‌లో మినిమమ్ బ్యాలెన్స్ నిబంధన అన్నది ఆయా బ్యాంకులకున్న స్వేచ్ఛ అని, ఇందులో ఆర్‌బిఐ జోక్యం ఉండదని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. బ్యాంకు ఖాతాల్లోని కనీస నిల్వల అంశంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. మినిమమ్ బ్యాలెన్స్ ఎంత ఉండాలనేది పూర్తిగా బ్యాంకుల నిర్ణయమని చెప్పారు. దీనిపై ఆర్‌బిఐ నియంత్రణ ఏదీ ఉండదని పేర్కొన్నారు. కనీస బ్యాలెన్స్ పరిమితిని ఐసీఐసీఐ బ్యాంక్ గరిష్ఠంగా రూ.50 వేలకు పెంచిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్న వేళ గుజరాత్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమం పాల్గొన్న సందర్భంగా ఆర్‌బిఐ గవర్నర్ మీడియాతో మాట్లాడారు. కనీస సగటు- బ్యాలెన్స్ ఎంత ఉండాలి అనే నిర్ణయం ఆర్‌బిఐ బ్యాంకులకే వదిలేసింది. కొన్ని బ్యాంకులు రూ.10వేలు నిర్ణయిస్తాయి. మరికొన్ని రూ.2 వేలు ఉంచుతాయి. కొన్ని కనీస బ్యాలెన్స్ నిబంధనను ఎత్తివేశాయి. ఈ అంశం ఆర్‌బిఐ నియంత్రణ పరిధిలోకి రాదని సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. పొదుపు ఖాతాల్లో కనీస నిల్వ లేనిపక్షంలో విధిస్తున్న అపరాధ రుసుమును ఇటీవల కొన్ని బ్యాంకులు ఎత్తివేస్తుండగా, ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం అందుకు భిన్నంగా ఖాతాదార్లకు షాకిచ్చింది. సేవింగ్స్ అకౌంట్లోల కనీస నిల్వ మొత్తాన్ని భారీగా పెంచేసింది. ఆగస్టు 1 తర్వాత ఖాతా తెరిచిన వారికే ఇది వర్తించనుంది. మెట్రో, అర్బన్ ప్రాంతాల్లో ఖాతాదార్లు కనీసం రూ.50,000 నిల్వ ఉంచాలి. గతంలో ఈ మొత్తం రూ.10,000గా ఉండేది. ఇప్పుడు ఏకంగా 5 రెట్లు- పెంచేసింది. సెమీ అర్బన్ ఖాతాదార్ల కనీస నిల్వ మొత్తాన్ని రూ.5,000 నుంచి రూ.25,000కు, గ్రామీణ ఖాతాదార్లకు రూ.2,500 నుంచి రూ.10,000కు సవరించింది. కనీస నిల్వ లేనిపక్షంలో ఛార్జీలు కనీస నిల్వకు ఎంత తక్కువ మొత్తం ఉంటు-ందో దానిపై 6 శాతం లేదా రూ.500 ఏది తక్కువైతే అది చెల్లించాల్సి ఉంటుందని ఐసీఐసీఐ బ్యాంక్ వెల్లడించింది. అయితే దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## అసలేం జరుగుతోంది?

అమరావతి,చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందనే ప్రచారం ఊపందుకుంది. చంద్రబాబు సర్కార్ పాలన కాలం కేవలం 14 నెలలు మాత్రమే. ఇంత తక్కువ సమయంలో ప్రభుత్వంపై వ్యతిరేకత ఏంటి? అనే ప్రశ్న రావచ్చు. దురదృష్టవశాత్తు గతంలో ఏ ప్రభుత్వంపై లేని వ్యతిరేకత ప్రచారం%్% ఈ ప్రభుత్వంపై సాగుతోంది. అది కూడా బలమైన మీడియా వ్యవస్థ చేతిలో ఉన్నప్పటికీ జరుగుతుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అసలేం జరుగుతున్నదో తెలుసుకునేందుకు ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించాల్సిన అవసరం వుంది.ఎన్నికల్లో వైసీపీని ఎదుర్కోవాలంటే బాగా డబ్బున్న వ్యక్తుల్ని బరిలో దింపాలని చంద్రబాబునాయుడు భావించారు. దీంతో రాజకీయాలతో ఏ మాత్రం సంబంధం లేని వారిని కూడా, కేవలం బాగా డబ్బుందని, ఎంతైనా ఖర్చు పెడతారనే ఏకైక కారణంతో టికెట్లు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజావ్యతిరేకతలో కూటమి అభ్యర్థులు గెలుపొందారు. ఎన్నికల్లో ఖర్చును పెట్టుబడిగా భావించిన నాయకులు, పదింతలు ఆదాయం కోసం అధికారాన్ని అడ్డుపెట్టుకుని, అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు.ఇలాంటి వాళ్లు కూటమిలో 50-60 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని అనుకుందాం. ఈ నెగెటివిటీ అంతా మిగిలిన ప్రజాప్రతినిధులపై పడుతోంది. మరీ ముఖ్యంగా ఈ దఫా సీనియర్ ఎమ్మెల్యేలు కూడా ఎందుకోగానీ, బరితెగించారన్న చెడ్డపేరు మూటకట్టుకుంటున్నారు. ఎవరూ ఎవరినీ అదుపు చేసే పరిస్థితి కనిపించడం లేదు.అప్పుడప్పుడు కొందరు ఎమ్మెల్యేలు, మంత్రుల అవినీతి, వారి అనుచరుల అరాచకాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీరియస్ అయ్యినట్టు వార్తలొస్తుంటాయి. ఇవన్నీ కేవలం ప్రజల కోసం బాబు మార్క్ పబ్లిసిటీ స్టంట్స్ అని టీడీపీ ప్రజాప్రతినిధులు విమర్శిస్తున్నారు. ముందు తన కుమారుడిని, అలాగే ఆప్తులైన మంత్రుల దోపిడీ ఆరోపణల గురించి చంద్రబాబు చూసుకోవాలని కూటమి ఎమ్మెల్యేలు, కొందరు మంత్రులు ఆఫ్ ది రికార్డ్‌గా మీడియా మిత్రుల వద్ద అభిప్రాయపడుతున్నారు.ఎన్నికల్లో అభ్యర్థుల మంచిచెడులను చూసి టికెట్ ఇవ్వడం లేదని, కేవలం డబ్బు ఆధారంగానే జరిగిపోతున్నాయని ప్రజాప్రతినిధులు అంటున్నారు. ఎన్నికల సమయంలో డబ్బుంటే తెలుగుదేశం కాకపోతే, ఇంకోదేశం టికెట్ ఇస్తుందని వారు వ్యంగ్యంగా అంటున్నారు. ఇందుకు ఉదాహరణగా గుమ్మనూరు జయరాం, కొలుసు పార్థసారథి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరుల గురించి వివరిస్తున్నారు. మంచితనానికి ప్రచారం తక్కువ. చెడుకు ఎక్కువ. కూటమి ప్రజాప్రతినిధుల విషయంలోనూ అదే జరుగుతోంది. 50 శాతం మంది ఎమ్మెల్యేలు, మంత్రులు దోపిడీకి పాల్పడుతున్నారని అనుకుందాం. అది కాస్త వందశాతం అవుతుంది. రాజకీయంగా మొత్తానికే నష్టం వచ్చే ప్రమాదం వుంది. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంకా వైసీపీ ప్రభుత్వం అలా, ఇలా అంటూ విమర్శలు చేయడంపైనే దృష్టి సారించారు. తన ప్రభుత్వంలో ఏం జరుగుతున్నదో ఆయనకు అవసరం లేనట్టుంది. మరోవైపు ప్రభుత్వానికి డ్యామేజీ జరిగిపోతోంది. దీన్ని అడ్డుకోవడం ఎవరి వల్లా కాదనే మాట వినిపిస్తోంది.

### ఆయన ఆరోగ్యంపై మాకు ఆందోళనగా ఉంది

న్యూఢిల్లీ, రాజీనామా చేసిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడం ఆచూకీ చెప్పాలంటూ శివసేన నేత సంజయ్‌రౌత్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరారు. ఆయనతో సంప్రదించాలని చూసినా ఆయన ఎక్కడున్నారో తెలియడం లేదన్నారు. ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామా దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అనారోగ్య కారణాలతోనే పదవి నుంచి వైదొలుగుతున్నట్లు- ఆయన చెప్పినప్పటికీ.. దీనిపై విపక్షాలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిణామాల వేళ తాజాగా శివసేన (యూబీటీ-) సీనియర్ నేత సంజయ్ రౌత్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ధన్‌ఖడ్‌ను తాము ఫోన్‌లో కూడా కలవ లేకపోతున్నామని, ఆయన ఎక్కడున్నారో చెప్పాలని కోరారు. మన మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఎక్కడున్నారన్న దానిపై ఎలాంటి సమాచారం లేదు. ఆయన ప్రస్తుత లొకేషన్ ఏంటి? ఆయన ఆరోగ్యం ఎలా ఉంది?వంటి ప్రశ్నలపై స్పష్టత రావట్లేదు. ధన్‌ఖడ్‌తో మాట్లాడేందుకు కొంతమంది రాజ్యసభ సభ్యులు ప్రయత్నించినా ఎలాంటి ఫలితం లేకపోయింది. ఆయనను, ఆయన సిబ్బందిని సంప్రదించలేకపోతున్నాం. ఇది చాలా ఆందోళనకరం. ధన్‌ఖడ్‌కు ఏం జరిగింది? ఆయన క్షేమంగానే ఉన్నారా? ఆరోగ్యంగానే ఉన్నారా? ఈ ప్రశ్నలపై దేశ ప్రజలకు సమాధానం కావాలని సంజయ్ రౌత్ తన లేఖలో ప్రశ్నించారు. ఈ లెటర్‌ను సంజయ్ రౌత్ ఆదివారం పంపించగా.. సోమవారం ఎక్స్ ఖాతాలో దీని గురించి పోస్ట్ చేశారు. ధన్‌ఖడ్ ఎక్కడున్నారో తెలుసుకునేందుకు సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయాలని అనుకుంటున్నట్లు ఎంపీ సంజయ్ రౌత్ వెల్లడించారు. సుప్రీంకోర్టుకు వెళ్లేముందు దీనిపై మీ నుంచి సమాచారం కోరడం ఉత్తమమని భావించాం. మా ఆందోళనలను అర్థం చేసుకుని మాజీ ఉపరాష్ట్రపతి ఆచూకీ చెబుతారని విశ్వసిస్తున్నాం అని శివసేన ఎంపీ తన లేఖలో పేర్కొన్నారు. గతవారం పలువురు విపక్ష నేతలు కూడా ధన్‌ఖడ్ సమాచారం కోసం కేంద్రాన్ని ప్రశ్నించారు.

# పన్నులు తెలంగాణకు.. సమస్యల తలనొప్పులు ఏపీకీనా?



హైదరాబాద్,మీ ఇంటికొస్తే ఏమిస్తావ్.. మాయింటి కొస్తే ఏం తెస్తావ్ అన్నట్లుగా ఉంది తెలుగు చలనచిత్ర పరిశ్రమ పెద్దల తీరు. ఔను తెలుగు సినీ పరిశ్రమ తీరు అడ్డగోలుగా ఉంది. పన్నులన్నీ తెలంగాణ ప్రభుత్వానికి కడతాం.. మా సమస్యలన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిష్కరించాలంటూ దబాయిస్తున్నట్లుగా కనిపిస్తోంది. . ఉండేది తెలంగాణ రాజధానిలో ... టాక్స్ లు కట్టేది అక్కడి ప్రభుత్వానికి, ఎనభై శాతం షూటింగ్ లు జరిపేది కూడా అక్కడే. పనిచేసే కార్మికులు కూడా80 శాతం మంది తెలంగాణ వారే. అక్కడ కార్మికులకు కడుపు కాలి ధర్నాలు చేస్తే.. ఏపీ సర్కార్ చర్చలు జరిపి పరిష్కరించాలని కోరుకుంటున్నారు. అసలు తెలంగాణలో సినీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఏపీకి సండంధం ఏమిటిబీ ఆ తలనొప్పి ఏపీ ప్రభుత్వానికి ఎందుకు అంట గట్టాలని చూస్తున్నారు? అన్నది అర్థం కాని పరిస్థితి. వాస్తవంలోకి వెళ్తే సినీ పరిశ్రమ మొత్తం హైదరాబాద్ లోనే ఉంది. సినిమా వాళ్ళంతా ఉండేది ,జూబ్లీహిల్స్ , బంజారాహిల్స్, మణికొండ తదితర ప్రాంతాల్లోనే. నిర్మాతలు, హీరోలు, హీరోయిన్లు, డైరెక్టర్లు ,క్యారెక్టర్ ఆర్టిస్టులు మొత్తం హైదరాబాద్ లోనే మకాం వేసి ఉన్నారు. కట్టే టాక్స్ లు కూడా ఎనభై శాతానికి పైగా తెలంగాణ ప్రభుత్వానికే కడతారు. కానీ ఏదైనా సమస్య వస్తే మాత్రం పరిష్కారం కోసం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వైపు చూస్తారు. అక్కడి సినీ పరిశ్రమకు కష్టం వస్తే.. హైదరాబాదులో సినీ కార్మికులు ధర్నాలు చేస్తుంటే.. ఏపీ ఈ వ్యవహారం పై ఏపీ ప్రభుత్వం ఒకసారి దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. తాజాగా సినీ పరిశ్రమంలో సంక్షోభాన్ని ఏపీ ప్రభుత్వానికి అంటగట్టాలని చూస్తున్నట్లు కనిపిస్తోంది. ఎందుకంటే అంతా బాగున్నప్పుడు తెలంగాణలో మకాం వేసి ఉంటారు? ఏదైనా సమస్య వచ్చినప్పుడు మాత్రం ,ఏపీలోకి వచ్చి హడావుడి చేసి వెళ్ళిపోతుంటారు. ఇలాంటి వ్యవహార శైలి ఇటీవల కాలంలో సినీ పరిశ్రమ పెద్దలకు ఎక్కువైపోయింది. తాజాగా ఏపీ ప్రభుత్వం దగ్గరకు నిర్మాతల బృందం వచ్చింది. ముఖ్యమంత్రి అపాయింట్ మెంట్ కావాలి.. మా సమస్యలు మొత్తం ఏకరువు పెట్టి తెలంగాణలో వచ్చిన సమస్య పరిష్కరించమని కోరుకుంటామంటూ ఏపీ సినీమాటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్ ను కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తలెత్తిన సమస్య గురించి సీఎం దృష్టికీ, డిప్యూటీ సీఎం దృష్టికీ తీసుకువెడతానని హామీ ఇచ్చారు. అయితే అసలు ఎక్కడో హైదరాబాదులో జరుగుతున్న ధర్నాలు,సమ్మెల వ్యవహారానికి ఏపీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఏం చేస్తారు? అసలు ఏదైనా సరే ఎందుకు చేయాలి? అన్న ప్రశ్న తలెత్తుతోంది. అసలు తెలుగు సినీ పరిశ్రమ ఎప్పుడో ఒక సారి వారి అవసరాల కోసం విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి వంటి ప్రాంతాలలో షూటింగ్ లు జరుపుకుని వెళ్లిపోడం వినా.. ఇక్కడ మకాం వేయడం కానీ, ఇక్కడ స్టూడియోలు, డబ్బింగ్ థియేటర్లు ఏమైనా నిర్మించడానికి కనీసం ప్రతిపాదలైనా చేశారా? అగ్ర హీరోల దగ్గర నుండి ,నిర్మాతల వరకూ మొత్తం హైదరాబాద్ లోనే.. సినిమా రీలీజుల సమయంలో మాత్రం టికెట్ల రేట్లు పెంచి.. ఏపీ ప్రేక్షకుల జేబులకు చిల్లు పెడతాం అనుమతించండి అంటూ ఏపీ ప్రభుత్వాన్ని కోరడం వినా, వీరు ఏపీకి చేసిందేమిటి? తమ నివాసాల దగ్గర నుంచి సినీమా వ్యవహారాలు, వ్యాపారాలూ అన్ని హైదరాబాద్ లో చేసుకుంటూ.. టాక్సులు కూడా అక్కడి ప్రభుత్వానికే కడుతూ.. మస్య రాగానే ఏపీ సర్కార్ వద్దకు పరుగులెత్తుకుంటూ వస్తారు. సమస్య రాగానే ఏపీ, ఏపీ ముఖ్యమంత్రి గుర్తుకు వస్తారు. . అటువంటి వారి పట్ల ఏపీ ప్రభుత్వం ఎందుకు సానుకూలతతో, సానుభూతితో ఉండాలి? ఎందుకు బాధ్యత తీసుకోవాలి అన్నదే ఇప్పుడు సగటు ఆంధ్రుడి ప్రశ్న. ఏదన్నా ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు విరాళాలు ప్రకటించి... మొత్తం ఆంధ్రప్రదేశ్ ను ఆదుకున్నట్లు బిల్డప్ లు ఇవ్వడం తప్ప, తెలుగు చలన చిత్ర పరిశ్రమకు సంబంధించినంత వరకూ ఏపీకి నయాపైసా ప్రయోజనం ఏముందని సగటు ఆంధ్రుడు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో.. ఇప్పుడు సినీ పరిశ్రమలో తలెత్తిన సమస్య పరిష్కారం కోసం జోక్యం చేసుకునే విషయంలో ఏపీ ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేయాలి. , సినీ పరిశ్రమ ఏపీకి వచ్చే విధంగా, ఏపీలో స్టూడియోలు, డబ్బింగ్ థియేటర్లు నెలకొల్పే విధంగా షరతు విధించాలి. అలా కాకుండా పన్నులు కట్టేది తెలంగాణలో.. సమస్యలు పరిష్కారం అయ్యేది ఆంధ్రప్రదేశ్ లో అన్నట్లుగా వ్యవహరిస్తామంటే మాత్రం పరిశ్రమ సమస్యల విషయంలో ఏపీ ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా దూరంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ మునీర్ ఒక పిరికివాడు

న్యూఢిల్లీ,పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ ఒక పిరికివాడు.. పిరికివాడు కాబట్టే ఇలా అండ చూసుకొని మొరుగుతున్నాడు. ఇదే మొరుగుడు ఆపరేషన్ సింధూర్ సమయంలో జనాల మధ్యకొచ్చి మొరిగితే ఈ పాటికి ఈయన ఫొటోకు దండ వేసేవారు. భారత్ తో యుద్ధం వేళ కుటుంబాన్ని ప్రత్యేక ఫ్లైట్ లో లండన్ పంపించి.. ఒక బంకర్ లో దాక్కున్న పిరికివాడు ఇప్పుడు వాపు అయిన అమెరికాను చూసుకొని బలుపుతో మాట్లాడుతున్నాడు. మునీర్ అమెరికా గడ్డపై నుంచి ఇటీవల చేసిన ప్రకటనలు, ఆయన నాయకత్వ శైలి, వ్యక్తిత్వంపై చర్చకు దారితీశాయి. యుద్ధ సమయంలో ఆయన పారిపోయారన్న ఆరోపణలు, తన కుటుంబాన్ని లండన్‌కు పంపించారని వార్తలు, తాను ఒక బంకర్‌లో దాక్కున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు ఇవన్నీ మునీర్ నాయకత్వ సామర్థ్యం, మానసిక ధైర్యంపై సందేహాలు సృష్టిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే, అవి పాకిస్తాన్ సైనిక నాయకత్వానికి ఒక పెద్ద దెబ్బ.ఒక సైనిక నాయకుడు యుద్ధ సమయంలో భయపడి పారిపోవడం అనేది ఊహించలేని విషయం. అలాంటి చర్యలు సైన్యం యొక్క నైతికతను దెబ్బతీస్తాయి. సైన్యాధిపతి ప్రజల ముందు, సైనికుల ముందు ధైర్యంగా నిలబడాల్సిన బాధ్యత ఉంది. జనరల్ మునీర్ పాకిస్తాన్ యొక్క ఇంటెలిజెన్స్ ఏజెన్సీ %×ూ×% మాజీ అధిపతిగా పనిచేశారు. ఆయన కఠినమైన, నిష్పాక్షికమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. కానీ, ఆయన ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత, పాకిస్తాన్‌లో రాజకీయ అస్థిరత, ఆర్థిక సంక్షోభం తీవ్రమయ్యాయి. ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం కూలిపోవడం, సైన్యంపై ప్రజల నమ్మకం తగ్గడం వంటి పరిణామాలకు మునీర్ కుట్రలు కుతంత్రాలే కారణం. ఈ సమయంలో మునీర్ నాయకత్వంపై ప్రజలలో, సైన్యంలో కొంత వ్యతిరేకత కూడా వచ్చింది. ఈ నేపథ్యంలోనే అమెరికా అండ చూసుకొని మునీర్ ఈ ఆరోపణలు చేయడం గమనార్హం.

మునీర్ పెద్ద మాటల వెనుక ఉన్న కారణాలు

గతంలో భయపడ్డారని ఆరోపణలు ఎదుర్కొన్న ఒక నాయకుడు ఇప్పుడు పెద్ద పెద్ద మాటలు మాట్లాడటం వింతగా అనిపించవచ్చు. అయితే, దీని వెనుక కొన్ని కారణాలున్నాయి. జనరల్ మునీర్ తన నాయకత్వ ప్రతిష్టను తిరిగి నిర్మించుకోవడానికి ప్రయత్నిస్తుండవచ్చు. గత ఆరోపణలను మర్చిపోయేలా.. తాను దృఢమైన, దేశభక్తి కలిగిన నాయకుడిగా ప్రజల ముందు నిలబడడానికి ప్రయత్నిస్తూ ఉండవచ్చు. పాకిస్తాన్ ఆర్థికంగా, రాజకీయంగా సంక్షోభంలో ఉంది. అటువంటి సమయంలో భారతదేశం వంటి ప్రత్యర్థి దేశాలపై కఠినమైన వైఖరి చూపడం ద్వారా ప్రజల మద్దతు పొందడానికి ప్రయత్నిస్తూ ఉండవచ్చు. ఇది దేశంలో ఉన్న అసంతృప్తిని పక్కదారి పట్టించడానికి ఒక మార్గం కావచ్చు.



సైన్యాధిపతి ధైర్యంగా, యుద్ధానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటనలు చేయడం ద్వారా సైనికులలో నైతికతను పెంచడానికి ప్రయత్నిస్తుండవచ్చు.

–పాకిస్తాన్ ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు

జనరల్ మునీర్ నాయకత్వం కేవలం ఆయన వ్యక్తిగత ధైర్యం మీద మాత్రమే ఆధారపడి ఉండదు. పాకిస్తాన్ దేశం ఒక క్లిష్టమైన దశలో ఉంది. సైన్యం రాజకీయాలలో అధికంగా జోక్యం చేసుకుంటుందనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సైన్యాధిపతిగా ఆయన తీసుకునే ప్రతి నిర్ణయం దేశ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది.మునీర్ నాయకత్వం నిజమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఉగ్రవాదం, ఆర్థిక సంక్షోభం, అంతర్గత రాజకీయ విభేదాలు, భారతదేశంతో సంబంధాలు వంటి అనేక సమస్యలు ఆయన ముందు ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడంలో ఆయన నిజమైన వైఫల్యం ప్రతీచోట బయటపడుతోంది. కేవలం మాటలతో కాకుండా, చర్యలతోనే ఆయన నాయకత్వానికి పరీక్ష నిలుస్తోంది. అందుకే దేశ ఆర్థిక వైఫల్యం ఉన్నా.. యుద్ధోన్మాదంతో చెలరేగి భారత్ పై ఎగదోసి అమెరికా అండతో దాన్ని డైవర్ట్ చేయాలనే ప్రతిపాదనతో ముందుకెళుతున్నట్టుగా తెలుస్తోంది. .మొత్తానికి, జనరల్ అసిమ్ మునీర్‌పై వచ్చిన ఆరోపణలు అన్నీ ఇన్నీ కావు. అమెరికా వద్ద పాకిస్తాన్ ను తాకట్టు పెట్టి.. ట్రంప్ కు దోచిపెట్టి.. ప్రచారానికి తన క్రేజ్ ను ఉపయోగించుకుంటున్నాడని అర్థమవుతోంది.. ఏది ఏమైనప్పటికీ ఒక దేశ సైన్యాధిపతికి ఉండాల్సిన ధైర్యం, నాయకత్వ లక్షణాలు మునీర్ లో ఏమాత్రం లేవు. కేవలం యుద్ధంలో మాత్రమే కాకుండా సంక్షోభ సమయాల్లో తన ప్రజలకు భరోసా ఇవ్వడంలో కూడా అసలైన నాయకత్వం ఆధారపడి ఉంటుంది. ఆపరేషన్ సింధూర్ వేళ పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ వ్యవహరించిన తీరు ఆయన పిరికితనానికి నిదర్శనంగా చెప్పొచ్చు. .

# 476 పార్టీల రద్దు.. ఈసీ నిర్ణయం వెనుక అసలు కారణం ఇదేనా..?

న్యూఢిల్లీ,ప్రధాని నరేంద్రమోడీ ఇటీవల ఒక గన్యా దేశ పర్యటనలో భారత్ గురించి అద్భుతమైన విషయాలు వెల్లడించారు. భిన్నత్వంలో ఏకత్వం, పదుల సంఖ్యలో భాషలు, వందలాది పార్టీలు ఇలా చాలా చెప్పారు. ఆ సమయంలో ఆ దేశ ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. ఒక దేశం ఇలా కూడా ఉంటుందా..? అని భరత్ అంటే ప్రపంచానికి జ్ఞానం నేర్పిన గురువు. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ ప్రతి రాష్ట్రంలో అనేక పార్టీలు ఉన్నాయి. కేంద్రంలో కూడా కొన్ని ఉన్నాయి. కానీ అవి ప్రధానంగా రెండు పార్టీలకు అనుగుణంగా పని చేస్తాయి.

ప్రతీ పార్టీ విలువైనదే..

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్. కాబట్టి ప్రతి పార్టీ ఇక్కడ విలువైనదే. ప్రతి పార్టీకి అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల నిర్వహన ఫలితాలు వెల్లడించే వరకు ప్రతీ అంశాన్ని స్వయం ప్రతిపత్తి గల ఎలక్షన్ కమిషన్ (ఈసీ) చూసుకుటుంది. స్వాతంత్రానికి ముందు ఒకటి రెండు పార్టీలు ఉన్నా.. ఆ తర్వాత రాష్ట్రాల్లో పార్టీల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కొన్ని నిబంధనలను తీసుకువచ్చింది. ఈసీ నిబంధనలకు లోబడి లేని పార్టీలను రద్దు చేస్తుంది. ఇది దేశంలో అప్పుడప్పుడు జరుగుతూనే ఉంటుంది.

మరో 476 పార్టీల గుర్తింపు రద్దు..

ఈ నెల(ఆగస్ట) లోనే దేశ వ్యాప్తంగా 334 రాజకీయ పార్టీలను రద్దు చేసిన ఈసీ తాజా మరో నిర్ణయం తీసుకుంది. తాజాగా మరోసారి 476 పార్టీలను రద్దు చేసినట్లు ప్రకటించి పార్టీలకు షాక్ ఇచ్చింది. అయితే ఇవన్నీ ఎన్నికల




నిబంధనలకు లోబడి లేవని తెలిపింది. ఇటీవల బిహార్ ఓట్ల జాబితా నుంచి 65 లక్షలకు పైగా ఓట్లను తొలగించింది. దీనికి సంబంధించిన డ్రాఫ్ట్ జాబితాను ఆగస్ట్ 1వ తేదీ రిలీజ్ చేసిన ఈసీ.. తుది జాబితాను సెప్టెంబర్ 30న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించింది.

నిబంధనల మేరకే తొలగింపు..

కేంద్ర ఎన్నికల సంఘం తొలగించిన పార్టీల్లో ఏపీ నుంచి 17, తెలంగాణ నుంచి 9 ఉన్నాయి. 2019లో ఎన్నికల సంఘం ఆయా పార్టీలకు కొన్ని ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా ఒక్క ఎన్నికలో అయినా పోటీ చేసి నియమితంగా ఓట్లను రాబట్టుకోవాలని సూచించింది. ఈ నిబంధన పరిధిలోకి రాని పార్టీలను ఈసీ తొలగించింది.

# బీజేపీకి కౌంటర్ స్లోగన్ అందుకున్న రాహుల్



న్యూఢిల్లీ,బీజేపీకి ఒకటి ఎపుడూ ముద్దు అని రాజకీయ పరిశీలకులు అంటారు. అఖండ భారతం ఆ పార్టీ ఫిలాసఫీ. చుట్టు పక్కన ఉన్న చిన్న దేశాలు అన్నీ కలసి ఒకే దేశంగా ఉండాలని అంతా అంటుంది. ఒక్కటే రేషన్ అని సైతం అన్నది.వన్ ఎలక్షన్ అని కూడా జమిలి ఎన్నికలకు సిద్ధపడుతోంది. ఇక దేశంలో ఒకే పార్టీ చిరకాలం అధికారంలో ఉండాలని అని బయటకు అనదు కానీ కోరిక మాత్రం అదే అని ప్రత్యర్ధులు ఎద్దేవా చేస్తూ ఉంటారు. అలాంటి బీజేపీకి అంతా ఆల్ ఇన్ వన్ అంటున్న కాషాయం పెద్దలకు అదే భాషలో అదే పొలిటికల్ లాంగ్వేజ్ లో కౌంటర్ స్లోగన్ తో షాక్ ఇచ్చారు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ.

వన్ మాన్ వన్ ఓట్ అంటూ :

ఇది శ్రీమాన్ రాహుల్ గాంధీ అందుకున్న కొత్త స్లోగన్. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అంటే బాగుంది కానీ వన్ మాన్ వన్ ఓట్ అంటే బాలేదా అని కాంగ్రెస్ నేతలు సెటైర్లు వేస్తున్నారు. అచ్చ తెలుగులో చెప్పాలీ అంటే ఒక వ్యక్తికి ఒకే ఓటు అన్నది తమ నినాదమని రాహుల్ గాంధీ అంటున్నారు. మరి ఈ దేశంలో ధనవంతుడికి అయినా పేదకు అయినా ఒక్కరికి ఒక్క ఓటే కదా ఎవరైనా అనవచ్చు. అంతేగా అలాగేగా జరుగుతోంది అని అనవచ్చు. కానీ అలా జరగడం లేదు అన్నదే కదా తమ పోరాటం అని రాహుల్ గాంధీ అంటున్నారు. వేరు వేరు పేర్లతో ఫేక్ ఐడీలతో చాలా ఓట్లు ఒకరి పేర్ల మీదనే ఉంటున్నాయని ఆయన అంటూ ఉద్యమిస్తున్నారు.

బీజేపీకే డైరెక్ట్ ఎటాక్ :

నిజానికి ఈసీ మీద పోరాటం అని అంటున్నా అసలైన రాజకీయ పోరాటం మాత్రం బీజేపీ మీదనే. ఈ సంగతి అందరికీ తెలుసు. బీజేపీ వరుస విజయాలను దేశంతో పాటు వివిధ రాష్ట్రాలలో కూడా సాధిస్తోంది. అయితే అవన్నీ ప్రజాభిప్రాయం పూర్తిగా కాషాయం ప్రతిబించి వచ్చిన ఫలితాలు కానే కావని కాంగ్రెస్ సహా ఆ పార్టీ మిత్ర పక్షాలు ఆరోపిస్తున్నాయి. ఓట్ల చోరీతోనే ఈ విజయాలు దక్కుతున్నాయని బలంగా చెప్పదలచారు. అయితే ఇందులో కూడా పదునైన వ్యూహం ఉంది అని అంటున్నారు.

ఎంతలా చర్చ జరిగితే అంతలా మేలు :

అవును ఈ దేశంలో బీజేపీ విజయాల వెనక ఏదో వ్యూహం ఉందన్న అభిప్రాయాన్ని జనాల్లోకి బలంగా పంపించడం ద్వారానే కమలానికి దెబ్బ కొట్టాలని కాంగ్రెస్ ప్లాన్ గా ఉంది అని అంటున్నారు. నిజంగా చూస్తే కనుక ప్రతీ ఎన్నికలో చిన్నా చితకా ఇబ్బందులు తప్ప సవ్యంగానే అంతా జరుగుతుంది అని అంటారు. కానీ ఇపుడు చాలా పెద్ద విషయాలే జరిగాయని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పదలచారు. తద్వారా బీజేపీ రాజకీయ ప్రతిష్టను ఆయన సవాల్ చేస్తున్నారు. బీజేపీకి పెద్ద దిక్కుగా ఉన్న మోడీ ఇమేజ్ కే పరీక్ష పెడుతున్నారు.

బీహార్ తోనే తేలుతుందా :

ఈ రాజకీయ రచ్చకు ముగింపు ఏమిటి అంటే ఈ ఏడాది నవంబర్ లో జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికలే అని అంటున్నారు. అక్కడ కనుక తిరిగి ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే మాత్రం రాహుల్ గాంధీ ఈసీ మీద చేసిన ఆరోపణలు కానీ బీజేపీతో ముడిపెట్టి సంధిస్తున్న విమర్శలు కానీ అన్నీ పూర్వపక్షం అవుతాయి. అలా కాకుండా ఇండియా కూటమి గెలిస్తే మాత్రం చూశారా మా ఉద్యమం వల్లనే ఇలా ప్రజాభిప్రాయాన్ని సాధించగలిగామని గొప్పగా చెప్పుకోవడానికి ఉంటుంది. ఇది 2026లో జరిగే పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల మీద కూడా ప్రభావం చూపించేందుకు వీలు ఉంటుంది. మొత్తానికి రాహుల్ అండ్ కో గురి పెడుతున్న ఈ నయా స్ట్రాటజీ బీజేపీని మిత్రులను ఏ మేరకు ప్రభావితం చేస్తుంది అన్నది చూడాల్సి ఉంది.

# ట్రంప్ ప్రభుత్వం 'బ్రోకరేజ్' పనిచేస్తుందా?



న్యూఢిల్లీ,అమెరికా–చైనా టెక్ యుద్ధంలో కొత్త అధ్యాయం. ఒకవైపు భద్రతా ఆంక్షలు మరోవైపు డబ్బు దారులు. ట్రంప్ సర్కారు కుదుర్చుకున్న తాజా ఒప్పందం ఇప్పుడు అంతర్జాతీయ వేదికలపై హాట్ టాపిక్. ఎన్విడియా, ఏఎండీ లాభాల్లో 15% నేరుగా అమెరికా ఖజానాకు! ఇది వాణిజ్యమా? వ్యూహమా? లేక బ్రోకరేజ్ మాస్టర్‌స్ట్రోక్‌నా? అని ట్రంప్ సర్కార్ దోపిడీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కేవలం అమెరికా దోపిడీగా కనిపిస్తోంది.. దీనిని కేవలం వాణిజ్య ఒప్పందంగా చూడలేం. ఇది భద్రతాపరమైన అంశాలను, ఆర్థిక లాభాలను, భవిష్యత్తు వ్యూహాలను కలిపి రూపొందించిన ఒక సంక్లిష్టమైన ప్లాన్. దీనిని ట్రంప్ ప్రభుత్వం 'బ్రోకరేజ్' అని అనడంలో ఎలాంటి సందేహం లేదు.

వ్యాపార వ్యూహం

ట్రంప్ తన వ్యాపార అనుభవాన్ని రాజకీయాలకు అన్వయించారనడానికి ఈ ఒప్పందం ఒక ఉదాహరణ. సాధారణంగా బ్రోకర్లు ఇరు పక్షాల మధ్య ఒప్పందాలు కుదుర్చి, తమకు కమీషన్ తీసుకుంటారు. ఇక్కడ ట్రంప్ ప్రభుత్వం ఇదే పని చేస్తోంది. ఒకవైపు అమెరికా టెక్ కంపెనీలైన %చీఎ×ణ×ూ , ూవీణ% తమ ఉత్పత్తులను చైనాకు అమ్మేందుకు లైసెన్స్ ఇస్తుంది. మరోవైపు ఈ అమ్మకాలపై వచ్చే లాభాల్లో 15% వాటాను ప్రభుత్వ ఖజానాకు మళ్ళిస్తుంది. ఈ పద్ధతి వల్ల అమెరికా కంపెనీలకు ఆదాయం వస్తుంది, చైనాకు అవసరమైన చిప్‌లు లభిస్తాయి. అమెరికా ప్రభుత్వానికి కూడా ఆదాయం వస్తుంది. ఇది ఒక ట్రిపుల్–విన్ పరిస్థితిలా కనిపిస్తుంది.

–వ్యూహాత్మక ప్రాముఖ్యత


ఈ డీల్ కేవలం డబ్బు గురించినది కాదు. ఇందులో కొన్ని వ్యూహాత్మక అంశాలు కూడా ఉన్నాయి. లైసెన్స్ పొందిన ఉత్పత్తులకు మాత్రమే అనుమతి ఇవ్వడం ద్వారా, అమెరికా ప్రభుత్వం ఏ రకమైన చిప్‌లు చైనాకు వెళ్తున్నాయో నియంత్రించగలుగుతుంది.ప్రతి సేల్ రికార్డు నేరుగా ప్రభుత్వానికి చేరడం వల్ల, అమెరికా ప్రభుత్వం వాణిజ్య కార్యకలాపాలపై పూర్తి పర్యవేక్షణ కలిగి ఉంటుంది. ఈ ఒప్పందం ద్వారా వచ్చే ఆదాయాన్ని చిప్ రీసెర్చ్, టెక్నాలజీ భద్రతకు ఉపయోగిస్తామని ట్రంప్ ప్రభుత్వం పేర్కొంది. అంటే, చైనా నుంచి వచ్చిన డబ్బును చైనా టెక్నాలజీ అభివృద్ధిని అడ్డుకోవడానికి ఉపయోగిస్తారన్నమాట. ఇది ఒక రకమైన వ్యూహాత్మక 'డబుల్ గేమ్'.

– దీర్ఘకాలిక ప్రభావాలు – సందేహాలు

ఈ విధానం వల్ల తాత్కాలికంగా అందరికీ లాభం ఉన్నప్పటికీ, భవిష్యత్తులో దీని పర్యవసానాలు ఎలా ఉంటాయనేది ఒక మిస్టరీ. ఈ ఒప్పందం వల్ల చైనా అధునాతన చిప్‌లను పొంది, కృత్రిమ మేధస్సు ఇతర రంగాలలో మరింత వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. భవిష్యత్తులో చైనా టెక్నాలజీ శక్తి పెరిగితే, అది అమెరికాకు కొత్త సవాళ్లను సృష్టించవచ్చు. ఒకవేళ చైనా టెక్నాలజీ శక్తి ప్రమాదకరంగా పెరిగితే, అమెరికా మళ్ళీ ఆంక్షల బాట పడుతుందా? అప్పుడు ఈ ఒప్పందం యొక్క ప్రయోజనాలు నిరుపయోగంగా మారవచ్చు.ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానం ఒక సరికొత్త గ్లోబల్ ట్రేడ్ ఫార్ములాను సూచిస్తుంది. ఇది టెక్నాలజీని పూర్తిగా మూసివేయకుండా, దానిని ఒక సాధనంగా ఉపయోగించుకొని ఆర్థిక లాభాలు పొందడం, అదే సమయంలో భవిష్యత్తుకు అవసరమైన పెట్టుబడులు పెట్టడం. ఇది కేవలం వాణిజ్యం కాదు, ఇది ఒక వ్యూహాత్మక బ్రోకరేజ్ మోడల్. ఇది తాత్కాలికంగా అందరికీ గెలుపులా కనిపించినా, దీర్ఘకాలంలో గెలుపు ఎవరిదనేది కాలమే నిర్ణయించాలి. ఎవరు ఎక్కువగా కష్టపడితే వారిదే లాభం. మొత్తానికి ట్రంప్ ప్రభుత్వం బ్రోకరేజ్ డీల్స్ పై విమర్శల వర్షం కురుస్తోంది.

# ఇంత డీటైల్డ్ గా వివరాలిస్తోంది విజయసాయేనా?

అమరావతి,లిక్కర్ స్కాంలో సీఐడీ సిట్ అనుబంధ చార్జిషీట్ ను దాఖలు చేసింది. అందులో చాలా అంటే చాలా వివరంగా స్కామ్ నగదు అంతా ఎటు పోయిందో.. ఎలాంటి ఆస్తులు కొనుగోలు చేశారో వివరించారు. ఇంత డీటైల్డ్ గా వివరాలు సీఐడీ సిట్ కు ఎలా తెలుస్తున్నాయో తెలియక.. వైసీపీ క్యాంప్ కూడా ఆందోళన పడుతోంది. వారి అనుమానం విజయసాయిరెడ్డి మీదనే పడుతోంది. ఆయనే అంతా చెబుతున్నారని అనుమాన పడుతోంది.విజయసాయిరెడ్డి అధికారికంగా అప్రూవర్ కాలేదు. కానీ ఆయన పూర్తి స్థాయిలో సిట్ కు సహకరిస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. గతంలో విచారణకు రావాలని సిట్ ఆయనకు నోటీసులు జారీ చేసింది. దానికి విజయసాయిరెడ్డి విచిత్రంగా స్పందించారు. మొదట వస్తానని సమాచారం ఇచ్చారు. తర్వాత తనకు తీరిక లేదన్నారు. పది రోజుల తర్వాత చూస్తానన్నారు. పది రోజులు దాటిపోయి చాలా రోజులు అయింది. సిట్ పట్టించుకోవడంలేదని అనుకుంటున్నారు. కానీ అధికారికంగా కాకుండా అనధికారికంగా అన్నీ చెబుతానని సిట్ అధికారులకు విజయసాయిరెడ్డి ప్రతిపాదన పెట్టి అన్నీ చెబుతున్నట్లుగా అనుమానిస్తున్నారు.విజయసాయిరెడ్డి జగన్ అక్రమ వ్యాపార సామ్రాజ్యంలో కీలక వ్యక్తి. మనీ ఎలా లాండరింగ్ చేస్తారో.. ఎవరు చేస్తారో ఆయనకు తెలుసు. లిక్కర్ స్కాంలో మొదట్లో విజయసాయిరెడ్డి కీలకంగా ఉన్నారు. తర్వాత రాజ్ కేసిరెడ్డి వచ్చి చేరారు. దాంతో విజయసాయిరెడ్డికి ప్రాధాన్యం తగ్గిపోయింది. అందుకే లిక్కర్ స్కాం



కర్త, కర్మ, క్రియ రాజ్ కెసిరెడ్డి విజయసాయిరెడ్డి ప్రకటన చేశారు. ఇప్పుడు దాన్ని నిరూపించే సాక్ష్యాలను ఆయన పరోక్షంగా సిట్ కు ఇస్తున్నట్లుగా తెలుస్తోంది.అయితే ఎక్కడ తీగ లాగినా అది అంతిమ లబ్దిదారు వద్దకే చేరుతుంది. విజయసాయిరెడ్డి నేరుగా జగన్ గురించి చెప్పకపోయినా.. ఆయన ఇచ్చే వివరాలతో సిట్ అధికారులు తీగ లాగుతున్నారు. అది జగన్మోహన్ రెడ్డి వద్దకు చేరుతోంది. అందుకే చార్జిషీట్‌లో ఆయన కనుసన్నల్లో జరిగిన విషయాన్ని సిట్ వివరంగా చెప్పిందని అనుకోవచ్చు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com